దసరాకి స్త్రీల వ్యాసరచన పోటీలో రెండవ బహుమతి
రు. 200/- పొందిన వ్యాసం

# ఆధునిక వస్త్రధారణ - సంప్రదాయ ధిక్కారణ

"అంత కడివెడు పాలపై
ఒక్కింత విరుగడ పేరినట్లుగ
మనకు మిగులును గతము లోపలి
మంచి; అదియే సంప్రదాయము"

అని డాక్టర్ సి. నారాయణరెడ్డి సంప్రదాయమును చక్కగా నిర్వచించినారు. ఆ 'మంచి' మనకు అనుసర ణీయమైనదే. కాని 'ఆధునిక వస్త్రధారణ-సంప్రదాయ ధిక్కారణ' అవుతుందన్న దానికి నేను పూర్తిగా వ్యతిరే కిని. అలాకాక అన్య సంప్రదాయ సమాదరణ అంటే సంతోషిస్తాను.

"రెండు దశాబ్దాల తర్వాత భారతీయ మహిళలు యూరోపియన్ దుస్తులు ధరించడానికి చీరలను వదిలి వేస్తా"రని ఇరవై సంవత్సరాల క్రితం ఫ్రెంచ్ ఫ్యాషన్ డిజైనర్ ప్రిరేకార్డిన్ జోస్యం చెప్పారు. (ఈనాడు 17-8-87 వార్త) ఈ జోస్యం నిజం కాలేదనటానికి వేరే ఉదాహరణ మాపక్కర్లేదనుకుంటాను. మన భార తీయ స్త్రీలను, మార్కెట్‌లోని చీరల అమ్మకాలను పరిశీలిస్తే సరిపోతుంది. అధునాతనమైన టెర్లిన్, పాలియస్టర్ వస్త్రాలు వచ్చినా పట్టుచీరలు, చేనేత చీరల. ఎడల మన స్త్రీల మక్కువ ఒక్కింత కూడా తగ్గలే దంటే అతిశయోక్తి కాదు.

గాంధీజీ 'భారతీయ స్త్రీలకు శాల్వార్ పైజామా పని పాటలకు అనుకూలంగా వుంటుం'దని శలవిచ్చినారు. అది అన్య రాష్ట్ర సంప్రదాయ సిద్ధమైనదే. దానిని మన రాష్ట్ర స్త్రీలు కూడా ధరించుతున్నారు.

పాశ్చాత్య సంప్రదాయమైన నైటీలు రాత్రిపూట అనుకూలంగా వుంటాయి. నడుముకు బిగించి వున్న చీరె, పై భాగాన బిగుతైన రవికె కంటే శరీరానికి వదులుగా వున్న నైటీ మాక్సీలు ఆరోగ్యరీత్యా రక్త ప్రసరణకు ఆటంకం కలుగ కుండా ఎంతో అనుకూల మైనవి అంటే ఎవరు కాదంటారు?

పనిచేసేవారికి హాఫ్ ప్యాంట్, షర్ట్ అనుకూలమైనవని పలువురి అభిప్రాయం. ఇది ఎంతైనా నిజం.

ఆడ పిల్లలకు మన సంప్రదాయమైన పరికిణీ, ఓణీ, జాకెట్‌నకు అవసరమైన వస్త్రమునకంటే శాల్వార్, పైజామా లేక మాక్సీలకు తక్కువ గుడ్డ సరిపోతుంది. డబ్బు పొదుపు చేసుకొనుటకే కాకుండా పిల్లలకు తేలికగాను వుంటుంది. కొంచెం చిన్నపిల్లలకు గౌనులు, మిడ్డీలు, స్కర్టులు, మాక్సీలు వాడుతున్నారు. వెరైటీ కోసం పరికిణీ జాకెట్ కుట్టిస్తున్నారు.

మగవారి సంప్రదాయమైన ధోవతి, కమీజు, కండు వాలను ఎంతమంది వాడుతున్నారు? ప్యాంటు, షర్టులు మన సంప్రదాయ వస్త్రాలవలె కనబడుతున్నాయి. అవి అన్ని పనులకు అనుకూలంగా వుండటమేకాక చూసే



టందుకు అందంగా కూడా వుంటాయి. అయితే పెళ్ళిళ్ళు వ్రతాది కార్యాల సందర్భంలో ప్యాంటు, షర్టులు నిషిద్ధం. మన సంప్రదాయ దుస్తులు రాజ్యమేలు తాయి. వీటి ప్రభావం వల్ల అవి మరుగుపడే ప్రమాదం నుండి బయటపడి ప్రజల పరిచయంలో వుండిపోతాయి. అవి మళ్ళీ ఫాషన్ ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లైతే పూర్వపు ప్రాముఖ్యతను సంతరిం చుకుంటాయి.

మార్పు అనేది మానవ సహజమే కాకుండా ప్రకృతి ధర్మం కూడా. అలాంటి మార్పులను ఆదరించాలి. అవి ప్రజలకు అనుకూలంగా వుంటే నిలబడతవి. లేని యెడల వచ్చినట్లే అదృశ్యమౌతవి. కావున ఆధునిక వస్త్రధారణ సంప్రదాయ ధిక్కారణ మాత్రం కాదని వొక్కి చెప్పగలను.

"ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిర
బిందువు
నైక నదీ నదాలు అదృశ్యంగా కలసిన అంతిస్సింధువు"
తిలక్

— ఎల్. ఉమాజీ
రామకృష్ణాపురం

## కాలమ్ దాటని కథ

అప్పారావంటే ఆఫీస్‌లో అందరికీ తగని చిరాకు. దానికి పెద్ద కారణం లేకపోలేదు. అసలు అప్పారావుది. ఒక రకమైన తత్వం. తాను వాడే "బాల్‌పాయింట్ పెన్ను దగ్గరనుంచి తాను ఎక్కి వచ్చే స్కూటరు వరకు" తనకు అన్నీ అందరూ ఉచితంగా ఇచ్చినవే అంటాడు.



### బుద్ధివచ్చింది...

అతణ్ణి పొరపాటున ఎవరైనా ఇది బాగుంది ఎక్కడ కొన్నారు అనడమే తరువాయి, "అబ్బే దీన్ని నేను కొన డమే! ఇది మా ఫ్రెండ్ సింగపూర్ నుంచి తెచ్చి ఇచ్చాడు" అని బడాయిగా చెబుతాడు. అడిగితే చెబితే ఫరవాలేదు. అడగని వాళ్ళకి కూడా తన స్నేహితులు తనకిచ్చిన వస్తువుల గురించి ఏకరువు పెడతాడు. ఈ బడాయి కబుర్లు భరించడం ఆఫీస్‌లో అందరికీ పెద్ద తలనెప్పి అయింది. ముఖ్యంగా అప్పారావుపక్క సెక్షన్‌లో పనిచేస్తున్న శంకరానికి చెవిలో జోరీగ అయినాడు.

ఎలాగైనా ఈ బడాయి కబుర్ల నుంచి బయటపడి. అప్పారావు బడాయి అణచటానికి సమయంకోసం ఎదురు చూస్తున్నాడు శంకరం. అంతలో అప్పారావు కొడుకు పుట్టినరోజు వచ్చింది.

ఆఫీసులో అందర్నీ పిలిచాడు. ఆఫీస్‌లో పనిచేస్తున్న ఆరుగురం సాయంకాలం అప్పారావు ఇంటికి బయలు దేరాము. పార్టీ బాగా అరేంజ్ చేయించాడు. పెట్టిన స్వీట్‌లు, హాట్‌లు తింటూ కబుర్లు చెప్పుకుంటు న్నాము. అప్పారావు మా దగ్గరకు వచ్చి కూర్చొని తన ఇంట్లో ఉపయోగించే చిన్న స్టూల్ దగ్గర నుంచి పెద్ద వస్తువుల వరకు తనకు తన ఫ్రెండ్స్ ఎప్పుడు, ఎలా ప్రజెంట్ చేశారో ఫుల్‌స్టాప్ లేకుండా చెప్పడం మొదలుపెట్టాడు. 'చెప్పాలంటే మా ఇంట్లో ఏ ఒక్క వస్తువూనా కష్టార్జితం కాదు, అన్నీ అందరూ ఉచితంగా ఇచ్చినవే' అని చెప్పి మా వంక గర్వంగా చూశాడు.

అంతలో వాళ్ళ మూడేళ్ళబాబు చాక్‌లెట్ తీసుకొని మా దగ్గరకు వచ్చాడు. సమయంకోసం ఎదురు చూస్తున్న శంకరం, "అన్నట్టు అప్పారావ్..ఈ ఇంట్లో ఏదీ నీ కష్టార్జితం కాదన్నావుగా, మరి వీడు కూడా మీ ఫ్రెండ్, ఎవరైనా..." అని మాట పూర్తిచేసే లోపల అప్పారావు ముఖం పెనంమీద మాడిన అట్టులా మాడి పోయింది. అంతే మరి ఎన్నడూ, ఎప్పుడూ, ఎక్కడా బడాయి కబుర్లు చెప్పలేదు. అప్పారావుకి తగిన బుద్ధి చెప్పినందుకు, ఆఫీస్‌లో అందరి తలనెప్పి తగ్గించి నందుకు శంకరానికి అందరూ థాంక్స్ చెప్పారు.

— వి.సుబ్బలక్ష్మి